సంక్షేమ పథకాలపై అవగాహన



దరఖాస్తులను స్వీకరిస్తున్న కమిషనర్, కార్పొరేటర్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ పరిధిలోని 3,4,8,9,13,14,18,19,23,24 డివిజన్లలో వార్డు సభలు నిర్వహించి సంక్షేమ పథకాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నామని బుధవారం పీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు అన్నారు.

◆ నేడు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 5,10,15,20,25,26 డివిజన్లలో వార్డు సభలు నిర్వహిస్తామని ప్రకటించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ పరిధిలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. సీతారాంనగర్‌కు చెందిన ప్రభాకర్‌కు రూ. 60 వేలు, న్యూ విద్యానగర్‌కు చెందిన సువర్ణ రూ. 17,500, ఓల్డ్ మల్కాజ్‌గిరికి చెందిన సీత సూర్యకళకు రూ.25,500 మంజూరయ్యాయని మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ తెలిపారు. శ్రీనివాస్‌గౌడ్, నీలం సతీష్, జనార్దన్, కోటేశ్వర్ పాల్గొన్నారు.

సత్కారం



హరినాయక్‌ను సత్కరిస్తున్న బీజేపీ నేతలు

కుషాయిగూడ: బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన ఇస్లావత్ హరినాయక్‌ను బుధవారం బీజేపీ చర్లపల్లి డివిజన్ నేతలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత తాళ్ల ఆనంద్‌గౌడ్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, యాదయ్య, దయానంద్, పోతరాజు, నాగరాజుచారి, కొండ సత్యనారాయణ, తాండ్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జయగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం స్వాతినక్షత్రం, లోక కల్యాణార్థం టీటీడీ స్థానిక కమిటీ సభ్యులు రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించి, అనంతరం అన్నదాన వితరణ చేశారు. ఆలయ అర్చకులు రఘుకిరణాచార్యులు, కమిటీ చైర్మన్ బాలరాజుయాదవ్, కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్, నాగరాజు, సత్యనారాయణ, కొమురయ్య, రాము, యాదగిరి, తదితరులున్నారు.

ఓయూ ప్రహరీ పరిశీలన

హబ్సిగూడ: ఓయూ క్యాంపస్‌కు ఆనుకుని ఉన్న ప్రహరీని బుధవారం రిజిస్ట్రార్ ప్రొ.నరేష్‌రెడ్డి సందర్శించారు. కూల్చివేసిన ప్రహరీని వెంటనే పునరుద్ధరించి, బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తార్నాక, హబ్సిగూడ, రామంతాపూర్‌తో సహా ఓయూ చుట్టూ పెట్రోలింగ్‌ను పెంచనున్నట్లు వివరించారు. ఓయూకు నష్టం కలిగించే ఎలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు

ఘట్‌కేసర్: విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా నూతన ఆవిష్కరణలు ఉండాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) వైస్ చాన్స్లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం అన్నారు. మున్సిపాలిటీలోని ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల (కేపీఆర్ఐటీ) ప్రతినిధులు, ఓయూ ప్రొఫెసర్ల బృందంతో ఆ కళాశాలలో విద్యారంగ అభివృద్ధి, ఇంజనీరింగ్ విద్యకు సంబంధించిన నూతన ఆవిష్కరణలు, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించే దిశగా పలు అంశాలపై బుధవారం చర్చించారు. ఆయా రంగాల్లో సంయుక్త నిర్ణయాలు తీసుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. కార్యక్రమంలో కేపీఆర్ఐటీ వైస్ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్, డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణ లక్ష్యం ఖరారు

- బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ.196 కోట్లు
- గతేడాది లింకేజీ కింద సాధించిన రుణ లక్ష్యం ప్రగతి 118 శాతం
- స్త్రీ నిధి రుణ లక్ష్యం రూ.18కోట్లు
- ఈ ఏడాదిలో సంఘాలకు రుణ లక్ష్యంపై డీఆర్‌డీఏ ప్రణాళిక



సాక్షి,సిటీబ్యూరో: మహిళా సంఘాలకు ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాన్ని నిర్దేశించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు మండలాల్లో 3,390 సంఘాలకు రూ.196 కోట్ల లింకేజీ రుణాన్ని మంజూరిచ్చేలా ప్రణాళికను రూపొందించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 3,383 మహిళా సంఘాలకు రూ.164.20 కోట్లకు గానూ నిర్దేశిత లక్ష్యాన్నిదాటి రూ.194.56 కోట్ల(118.48శాతం) రుణాలను పంపిణీ చేయటంతోపాటు రికవరీలోనూ ప్రగతిని సాధించారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ నిర్దేశిత రుణ లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వం ద్వారా రుణాలను తీసుకున్న వారందరూ తమ ఆదాయాన్ని అభివృద్ధి చేసుకునేలా నూనెలు, కిరాణాలు, పప్పుల మిల్లులు, ఇతరత్రా ఉత్పత్తుల తయారీలో భాగంగా భిన్నమైన యూనిట్లను నెలకొల్పుకున్నారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. మరోవైపు మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీని ప్రభుత్వం తిరిగి సంఘాల ఖాతాలో జమచేయాల్సి ఉండగా.. దాదాపుగా మూడేళ్లవడ్డీ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వడ్డీ చెల్లిస్తామని, వడ్డీలేని రుణ పథకాన్ని చేపడతామన్న కొత్త ప్రభుత్వం ప్రకటన అమలుతో మహిళా సంఘాలు మరింతగా బలోపేతం కావటంతోపాటు ప్రోత్సాహకరంగా ఉండనున్నట్లు డీఆర్‌డీఏ పేర్కొంటోంది. అలాగే, స్త్రీనిధి కింద మహిళా సంఘాలకు రుణ లక్ష్యం రూ. 18 కోట్లు అందజేసేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. గతేడాది స్త్రీనిధి కింద స్వయం సహాయక సంఘాలకు రుణ లక్ష్యం రూ.15.01 కోట్లు కాగా, రూ.15.48 కోట్లు (102.17 శాతం) పంపిణీ చేశారు. లక్ష్యానికి మించి ప్రగతి సాధించటంతో ఈ ఏడాది రుణ లక్ష్యాన్ని రూ. 19 కోట్లకు పెంచినట్లు డీఆర్డీఏ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న మేడ్చల్ జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి

మేడిపల్లి: మేడ్చల్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రఘునాథస్వామి మేడిపల్లి మండలంలోని పలు ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. బుధవారం భగత్‌సింగ్‌నగర్‌లోని బస్తీ దవాఖాన, మేడిపల్లిలోని హర్బన్ ప్రైమరీ ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి గర్భిణీలకు పరీక్షలు, ప్రసవాలు, ల్యాబ్ సేవలు, రోగనిర్ధారణ, పార్మసీస్టాక్‌లు, టీకాలు, ఔషధ నిల్వలను సమీక్షించారు. ఆపరేషన్ థియేటర్లు, లేబర్‌రూమ్‌ల పనితనం గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యాధికారులు సమయపాలనను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఔషధ నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, కావాల్సిన మందులను జిల్లా డ్రగ్స్‌స్టోర్ నుంచి సేకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా అందించే అన్ని ప్రయోజకాలు ప్రజలకు అందేలా చూడాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించండి



జీహెచ్‌ఎంసీ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేతలు

మల్లాపూర్: నాచారం కూరగాయల మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ ఎస్టేట్ అధికారులకు నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారం శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మార్కెట్‌లో మౌలిక వసతులతో పాటు రోడ్లు వేయాలని కోరామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అధికారులు త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. కృష్ణారెడ్డి, బాలుయాదవ్, శ్రీధర్, కాళిదాసు, శ్రీధర్‌గౌడ్, రమేష్, కిరణ్, బాలు, మార్కెట్‌సభ్యులు తదితరులున్నారు.

కార్పొరేటర్ పర్యటన

మల్కాజిగిరి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బుధవారం అధికారులతో కలిసి కృష్ణసాయికాలనీ, బాలసరస్వతీనగర్ తదితర కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న హైటెన్షన్‌లైన్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నాలాల్లో పూడికతీత పనులు, మ్యాన్‌హోల్స్ మరమ్మతులు, చెత్త,చెదారంపై తదితర సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచించామన్నారు. ఏఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజుల, ఏఈ గోపాల్, ఏఈ నవీన్ తదితరులున్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

యువకుడి ఆత్మహత్య

ఉప్పల్: కుటుంబకలహాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ శ్రీరామ్ కాలనీలో నివాసం ఉండే బానోతు మహేష్ (28) కుటుంబకలహాలతో తీవ్ర మనస్తాపం చెంది బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ ఈటల దాడి అమానుషం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఏకశిలా నగర్ వెంచర్‌ను పరిశీలించడానికి వచ్చిన ఎంపీ ఈటల రాజేందర్ ఓ రియల్ ఎస్టేట్ బ్రోకర్‌పై చేయి చేసుకోవడాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మెట్టు నర్సింహారెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పోలీసులు, అధికారులు చేయాల్సిన పనిని ఎంపీ చేయడమేమిటని ప్రశ్నించారు. స్థాయిని మరిచిపోయి ప్రవర్తించారని విమర్శించారు. ప్రైవేట్ వ్యక్తుల ఆస్తుల వివాదాన్ని పరిష్కరించేందుకు కోర్టులు, పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం ఉన్నాయన్న విషయం మర్చిపోయి వ్యవహరించినట్లు ఉందన్నారు. స్థానిక నాయకులు ఈటలను తప్పుదోవ పట్టించారన్నారు. ఎంపీకి సరైన సమాచారం ఇవ్వకుండా ఇరుకున పడేశారన్నారు. వ్యక్తులపై చేయి చేసుకోవడం రాజకీయ నాయకులకు తగదన్నారు. ఇప్పటికైనా బీజేపీ నాయకులు ఆవేశంతో కాకుండా ఆలోచనతో వ్యవహరించాలని హితవు పలికారు.

వృద్ధురాలి అదృశ్యం



భాగ్య (ఫైల్)

జవహర్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్‌లో నివసించే కందగట్ల భాగ్య (63) కుటుంబ సభ్యులతో ఉంటోంది. ఈ నెల 6న ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఫలితం లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే గతంలో భాగ్య అప్పులు చేసి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

ఘట్‌కేసర్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీలోని ఘనాపూర్‌లో గ్రామ సభ, 7,8,10,11 వార్డుల్లో బుధవారం నిర్వహించిన వార్డు సభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఈ నెల 26న ప్రారంభం కానున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 24 వరకు గడువు ఉందన్నారు. కొత్త రేషన్ కార్డులు, కార్డులో కొత్త పేరు నమోదు కోసం గతంలో దరఖాస్తు చేయనివారు ఈ సభల్లో దరఖాస్తు పెట్టుకోవాలన్నారు. ఎంపీడీఓ గీతరెడ్డి, తహసీల్దార్ రజిని, కౌన్సిలర్లు నాగజ్యోతి, నర్సింగ్ రావు, హేమలత, శశికళ, మల్లేష్, కోఆప్షన్ సభ్యుడు షౌకత్, కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజ్‌ముదిరాజ్, నాయకుల ఖయూమ్, శివప్రదీప్‌రెడ్డి, రాజు, సురేష్ పాల్గొన్నారు.

కొనసాగిన వార్డు, గ్రామ సభలు



కండ్లకోయ వార్డు సభలో అధికారులు, నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వార్డు, గ్రామ సభలు కొనసాగాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో ఏర్పాటు చేసిన వార్డు సభలో కౌన్సిలర్ హంసరాణి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, అధికారులు, మాజీ సర్పంచులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్‌లు పాల్గొని ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల జాబిత వివరించి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని రాజబొల్లారం, సోమారం, ఎల్లంపేట్, రాజబొల్లారం తండా గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. గ్రామస్తులు సభలో పాల్గొని కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాల జాబితాలో తమ పేర్లు లేవని అధికారులతో మొరపెట్టుకుని తిరిగి దరఖాస్తులు సమర్పించారు.



రాజబొల్లారం గ్రామ సభలో అధికారులు, గ్రామస్తులు

రైతు భరోసా భూముల సర్వే

నిరుపయోగంగా 159 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించిన అధికారులు



సర్వేలో కాప్రా తహసీల్దార్ సుచరిత, అధికారులు

కాప్రా: కాప్రా రెవెన్యూ అధికారులు కాప్రా మండల పరిధిలో రైతు భరోసా భూములను సర్వే చేపట్టారు. మండల పరిధిలో రైతుభరోసా పథకం పరిధిలోకి రాని 159 ఎకరాలను గుర్తించినట్లు తహసీల్దార్ సుచరిత తెలిపారు. గతంలో రైతుబంధు పొందిన లబ్ధిదారుల భూములను రీవెరిఫికేషన్ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో సర్వే చేపట్టామన్నారు. 15,16,17 తేదీల్లో కాప్రా మండల పరిధిలోని కాప్రా, చర్లపల్లి ప్రాంతాల్లో సర్వే చేపట్టిన వివరాలను బుధవారం తహసీల్దార్ వెల్లడించారు.

గతంలో 203 ఎకరాలకు 114 లబ్ధిదారులు..

గతంలో మండల పరిధిలోని 203 ఎకరాలకు 114 మంది లబ్ధిదారులు రైతుబంధు పొందారన్నారు. ప్రస్తుతం సదరు భూములు వ్యవసాయానికి అనుకూలంగా లేనట్లు గుర్తించామన్నారు.

నివాసాలు, కమర్షియల్ భవనాలు..

భూములను సర్వేచేసిన అధికారులు 159 ఎకరాల్లో నివాసగృహాలు, కమర్షియల్ భవనాలు, స్కూళ్లు, లే అవుట్‌లు వెలిసినట్లు చెప్పారు. దీంతో కేవలం 44 ఎకరాలకు మాత్రమే రైతుభరోసా పథకానికి అర్హులుగా గుర్తించి జిల్లా కలెక్టర్‌కు నివేదించినట్లు పేర్కొన్నారు. సర్వేయర్, ఎంపీఎస్‌ఓ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వ్యవసాయ అధికారులు ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



యూజీడీ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కుషాయిగూడలో రూ.18.5 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిరోజు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, శివకుమార్‌గౌడ్, చక్రపాణిగౌడ్, వెంకటరెడ్డి, సీతారాంరెడ్డి, ప్రభాకర్, బత్తుల శ్రీకాంత్‌యాదవ్, కిషోర్‌గౌడ్, యాదయ్య, బాల్‌నర్సింహా, వెంకటేష్, బ్రహ్మాచారి, రవి, అనిల్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సైన్‌బోర్డులతో అడ్రస్ గుర్తించడం సులభం

కుషాయిగూడ: కాలనీల్లో సైన్‌బోర్డుల ఏర్పాటుతో అడ్రసులు గుర్తించడం సులభతరం అవుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. హెచ్‌బీకాలనీ ఫేస్–2 సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీలో ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులు, కమ్యూనిటీ భవనాలను కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని కాలనీల్లో సైన్‌బోర్డులతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం సంక్రాంతి పండుగ సందర్భంగానిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గుమ్మడి జంపాల్‌రెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, నరేందర్‌రెడ్డి, చంద్రమోహన్, జగదీశ్వర్, భువనచంద్ర, వెంకటేశం, రామచంద్రారెడ్డి, రమేష్‌బాబు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సైన్‌బోర్డులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ ప్రభుదాస్

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్

బోడుప్పల్: అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన నూతన రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిమిత్తం 11, 12,13,14,15,16,17,18,19వ డివిజన్లలో ఏర్పాటు చేసిన వార్డులకు కమిషనర్ రామలింగంతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ వార్డు సభల్లో స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హులను ఎంపిక చేసి అందేలా చూస్తామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, శ్రీవిద్యచక్రపాణిగౌడ్, హేమలతాజంగారెడ్డి, 19వ డివిజన్ ఇన్‌చార్జి బొమ్మక్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఉప్పల్: 25 నుంచి సంగారెడ్డిలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఉప్పల్ కార్యదర్శి వెంకన్న అన్నారు. బుధవారం మహాసభల పోస్టర్‌ను సీపీఎం నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. వెంకన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని అభిప్రాయపడ్డారు. మహిళ నేత వినోద, నాగరాజు, ఊర్మిళ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

ప్రభుత్వ పథకాలపై ప్రశ్నించండి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించినా, వారి పేర్లు జాబితాలో లేకపోయినా అధికారులను నిలదీయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో పార్టీ కార్పొరేటర్లు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీపై ప్రజలను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇంటి జాబితాలో అర్హుల పేర్లు లేవని ఈ విషయాన్ని వార్డు సభలో గట్టిగా నిలదీయాలని సూచించారు. అధికారులు పారదర్శకంగా పనిచేయకపోతే సీఎం దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. కార్పొరేటర్లు విజయశాంతిరెడ్డి, మురుగేష్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

క్రీడా మైదానాన్ని కబ్జా చేస్తే కఠిన చర్యలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో క్రీడా మైదానానికి కేటాయించిన సర్వే నెంబర్–704,706 స్థలం కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ మేయర్ కావ్య, ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలోనే యువతకు క్రీడా మైదానాన్ని కేటాయించామని, కబ్జా చేస్తే ఏలాంటి వారిపైన అయిన కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు నరేందర్‌యాదవ్, కార్తీక్‌రెడ్డి, విక్రమ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న మాజీ మేయర్ కావ్య, యువ నాయకులు

సకాలంలో పనులు పూర్తిచేశాం



నారపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: పోచారం మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో పూర్తి చేసిన అభివృద్ధి పనులను చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.3.20 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులను పూర్తి చేశామన్నారు. 13వ వార్డులో సీసీ రోడ్డు, 15వ వార్డులోని నారపల్లిలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఎస్సీ వైకుంఠధామం, డ్వాక్రా భవనం వినియోగంలోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు శ్రీలతా బుచ్చిరెడ్డి, సరితా స్వామి, మమతా జగన్మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్రం అలీ తదితరులు పాల్గొన్నారు.